క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వలిగొండ: మండల కేంద్రానికి చెందిన బండారి శ్రావణి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.29,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. వారిలో కుంభం వెంకటపాపిరెడ్డి, పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, బత్తిని లింగయ్య, సత్యనారాయణ, చిలుకూరి సత్తిరెడ్డి, మైసోళ్ల ప్రవీణ్ కుమార్, తిరుపతయ్య, గజ్జెల అమరేందర్, మచ్చగిరి, కొండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

వలిగొండ: మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం కుంభం ఫౌండేషన్ అధినేత్రి కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రి వారి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంపై వెల్వర్తి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాశం సత్తి రెడ్డి, కంకల కృష్టయ్య, ఉక్కుర్తి స్వామి, మైసోళ్ల ప్రవీణ్ కుమార్, చిలుగురి సత్తిరెడ్డి, కలుకూరు చంద్రయ్య, దుడ్డు రమేష్, బైరు సైదులు, చెవ్వ మధు, నాగరాజు, మల్లం ఉపేందర్ పాల్గొన్నారు.

భువనగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు హనిఫ్ మెమన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం జ్ఞాన ప్రకాష్‌రెడ్డి, కొండల్ రెడ్డి, ఉపేందర్‌రావు, గుమ్ముల మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, ఇంతియాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు ప్రజలు

చౌటుప్పల్: వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 13వ వార్డు పరిధిలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు శనివారం మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, సిమెంట్‌రోడ్లు వేయలేదని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో చెవగోని వెంకటేష్, తొర్పునూరి రవి, గుంటోజు ఆంజనేయచారి, పాక చిరంజీవి, తొర్పునూరి మల్లేష్, లింగస్వామి, చెరుకు అశోక్, రాము, ఉష్కాగుల వెంకటేష్, మార్గం స్వామి, సందగళ్ల నాగరాజు, బొమ్మిరెడ్డి జీవన్ రెడ్డి, క్లెం నాగరాజు, ఎర్రసాని శేఖర్, చెరుకు శివ, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు డాక్టరేట్ ప్రదానం



భువనగిరి: భువనగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న సత్యనారాయణకు డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టర్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో భౌతికశాస్త్రంలో చేసిన పరిశోధనకు గాను శనివారం ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

సంస్థాన్ నారాయణపురం: గుడిమల్కాపురం ఎంపీటీసీ స్థానం పరిధి నుంచి రాచకొండ, కడిలబావితండా, తుంబాయితండా, వెంకబావి తండాల గ్రామ పంచాయతీలను కలిపి నూతన ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి శనివారం హైదరాబాద్‌లో వినతి పత్రం అందజేశారు. వారిలో రవీందర్, భాలునాయక్, రమేష్, జగన్, గోవర్ధన్, సత్తయ్య, నర్సిరెడ్డి తదితరులున్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చౌటుప్పల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని టీజీఎన్‌ఏబీ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, సీఐ మన్మథకుమార్ అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో శనివారం డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో ఈనెల 24నుంచి 27వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల కరపత్రాలను శనివారం దేవాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పాలకూర్ల సతీష్, కమిటీ గౌరవ అధ్యక్షులు పాలకూర్ల గిరి, పాలకూర్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శి సురపల్లి జోహార్, కోశాధికారి దూసరి శ్రీనివాస్, గూడూరి ఇంద్రసేనారెడ్డి, ఇడుకుల్ల సురక్షితం, ఉమాశంకర్, కృష్ణకుమార్ తదితరులున్నారు.

నీటి వృథాకు చెక్!



మల్లాపురం గ్రామంలో జలకళ సంతరించుకున్న చెక్‌డ్యామ్



చిన్నకందుకూరు గ్రామంలో కొనసాగుతున్న చెక్ డ్యామ్ నిర్మాణ పనులు

- ఇప్పటికే ధర్మారెడ్డిగూడెం, పెద్దకందుకూరులో రూ.2 కోట్లతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం
- ఇటీవల మల్లాపురంలో పనులు పూర్తి
- చిన్నకందుకూరులో కొనసాగుతున్న చెక్ డ్యామ్ నిర్మాణం
- పెరగనున్న భూగర్భ జలాలు

యాదగిరిగుట్ట రూరల్: ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. భూగర్భ జలాలు పెంచేందుకు యాదగిరిగుట్ట మండలంలోని పలు గ్రామాల్లో వాగులు, వంకలు, కాల్వల మధ్యలో చెక్ డ్యాములు నిర్మిస్తున్నారు. ఇటీవల మల్లాపురం గ్రామంలో రూ.1.14 లక్షలతో చెక్ డ్యామ్‌ను పూర్తి చేశారు. ధర్మారెడ్డిగూడెం, పెద్దకందుకూరు గ్రామాల్లో గతంలో రూ.2 కోట్లు వెచ్చించి చెక్ డ్యామ్‌లు నిర్మించారు. చిన్నకందుకూరు గ్రామంలో రూ.1.65 లక్షలతో నూతన చెక్ డ్యామ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవే కాకుండా మండలంలోని పది చిన్న చెక్ డ్యామ్‌లు ఉన్నాయి. ఇటీవల మల్లన్న సాగర్ నుంచి మండలంలోని అన్ని చెరువులు నిండగా, చెరువుల కింద వాగులో ఉన్న ఈ చెక్ డ్యామ్‌లు నీరు వృథా కాకుండా కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. చెక్ డ్యామ్‌ల వల్ల సమీప ప్రాంతాల్లో కూడా నీటి నిల్వలు పెరిగి వ్యవసాయ సాగుకు లోటు లేకుండా ఉంటుందని, భూగర్భ జలాలు పెరగడం వల్ల సాగు విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

నీటి వృథా తగ్గింది



గతంలో చెరువు నుంచి అలుగు వచ్చే నీరు వృథాగా పోయేది. ఇప్పుడు వాగుల మధ్యలో చెక్‌డ్యామ్‌ను నిర్మించడం వల్ల సాగుకు నీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. మా వ్యవసాయ బోరు బావుల్లో నీటి సమస్య తీరింది. వేసవిలోనూ పంటలకు ఎలాంటి సమస్య ఉండదు. చెక్ డ్యామ్‌లతో చాలా రైతులకు చాలా మేలు జరుగుతుంది.

– పల్లెపాటి సత్యం, రైతు, మల్లాపురం

భూగర్భ జలాలు పెరుగుతాయి

వాగుల మధ్యలో చెక్ డ్యామ్‌లు నిర్మించడం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో సాగు చేసుకుని పంటలు పండించడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. వేసవి కాలంలో కూడా పంటలకు సమృద్ధిగా నీరందుతాయి. బోరు బావుల్లో కూడా నీటి మట్టం పెరుగుతుంది.

– బాలకృష్ణ, ఇరిగేషన్ డీఈ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఆలేరురూరల్: దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె ఇంట్లో ఉంటున్న వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, పరుశరాములు, రవి, పోతు ప్రవీణ్, సపంత్, భిక్షపతి, జానమ్మ, భవాని, స్వామి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదు

ఆలేరురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని, నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కుండె సంపత్ ఆరోపించారు. శనివారం ఆలేరులోని బహద్దూర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి సర్వే చేసి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు వస్పరి బాలయ్య, అంకిరెడ్డి కృష్ణ, రాయపురం నర్సింహులు, పల్లె మహేష్, సుధాకర్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మేలు



కేంద్రప్రభుత్వం ఆదాయ పన్ను పరిమితిని రూ.7లక్షల నుంచి రూ.12లక్షలకు పెంచడం వల్ల 75 శాతం మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. గ్రేడ్ 1 గెజిటెడ్ ఆఫీసర్ల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇది ఉద్యోగుల కుటుంబాలకు ఊరటనిచ్చే అంశం. పన్ను మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగులు ఎంతోకాలంగా కోరుతున్నారు.

–గంగుల పురుషోత్తంరెడ్డి, సబ్‌ట్రెజరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఇది సంక్షేమ బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమ బడ్జెట్. ప్రధాని మోదీ ఆలోచనలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేశారు. ఆదాయ పన్ను పరిమితి పెంచడంతో వేతన ఉద్యోగులకు, మధ్య తరగతి ప్రజలకు ఊరటనిస్తుంది. గడిచిన దశాబ్ద కాలంలో ఇలాంటి సాహసోపేత నిర్ణయం రాలేదు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంటర్‌నెట్ సౌకర్యంతో వారికి సాంకేతిక ఫలాలు అందుతాయి.

– చందా మహేందర్‌గుప్తా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

లక్కారం గ్రామానికి పైప్‌లైన్ ద్వారా మూసీ జలాలు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లక్కారం గ్రామస్తులు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామానికి పిలాయిపల్లి కాలువ నుంచి పైప్‌లైన్ ద్వారా మూసీ జలాలు అందిస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. లక్కారం గ్రామానికి మూసీ జలాలు అందించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. గ్రామ శివారులోని బొద్దికుంటలోకి మూసీ జలాలు తీసుకువస్తే 3వేల ఎకరాల భూమి సాగు అవుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఆయన నీటి పారుదలశాఖ అధికారులతో మాట్లాడారు. పైప్‌లైన్‌కు అవకాశం ఉన్నందున త్వరలో ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు.

ఇంటి స్థలాలకు పట్టాలు మంజూరు చేస్తాం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీరాములు

భువనగిరి: భువనగిరి పట్టణంతో పాటు మండల పరిధిలో మార్చి వరకు అర్హులందరికీ ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భువనగిరి పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇంటి స్థలాలు ఇచ్చే ప్రక్రియను పరిశీలిస్తామని చెప్పారు. అంతకు ముందు సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు రావి నారాయణరెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని, పట్టణంలోని 35 వార్డుల్లో అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, మండల కార్యదర్శి రాములు, నాయకులు అభిలాష్, లక్ష్మయ్య, సత్తయ్య, వెంకట్‌రెడ్డి, యాదగిరి, కిష్టయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



డి.రేపాకలో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. అడ్డగూడూరు మండల పరిధిలోని డి.రేపాక గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాంస్కృతిక, కబడ్డీ క్రీడాపోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. విజేతలకు నగదు బహుకరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చేడే చంద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ ధైద పురుషోత్తం రెడ్డి, మోత్కూర్ మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్లు విద్యాసాగర్, సోమన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పరుశురాములు పాల్గొన్నారు.

3న కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశం



మాట్లాడుతున్న పూర్ణచందర్‌రావు

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఎల్‌ఎన్ గార్డెన్స్‌లో సోమవారం జరిగే తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మోత్కూరు మాజీ మార్కెట్ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు కోరారు. శనివారం ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతమ్‌కు, ఇటీవల యాదాద్రి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా నియామకమైన పైళ్ల సోమిరెడ్డి, నూతన యూత్ కాంగ్రెస్ నాయకులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ నారగోని అంజయ్య, గూడెపు పాండు, కాంగ్రెస్ మండల నాయకులు జినుకల కనకయ్య, రాచకొండ రమేష్, కారుపోతుల వెంకన్న, వల్లంభట్ల రవీందర్‌రావు, బైరెడ్డి సందీప్‌రెడ్డి, జంగ సురేష్, మారిశెట్టి మల్లేష్, ఆలకుంట్ల శ్రీను, బుషిపాక నరేష్ పాల్గొన్నారు.

భారీగా తరలిరావాలి

అడ్డగూడూరు: మోత్కూర్ మండల కేంద్రలో ఈనెల 3న జరిగే తుంగతుర్తి నియోజకవర్గంలోని 9 మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మోత్కూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూర్ణచంద్రరావు, రాష్ట్ర నాయకులు నాగోని అంజయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ కోరారు. శనివారం అడ్డగూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు పూలపెల్లి సోమిరెడ్డి, సీనియర్ నాయకులు వల్లంభట్ల రవీందర్‌రావు, గూడెపు పాండు, బొమ్మగాని లక్ష్మయ్య, మండల ఉపాధ్యక్షుడు కడారి రమేష్, చేడే మహేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి సందీప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబేద్కర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి మల్లేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కప్పల రాజేష్ పాల్గొన్నారు.

అభ్యున్నతిలో భాగస్వాములు కావాలి

సంస్థాన్ నారాయణపురం: పద్మశాలీ కుల బాంధవుల అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని పద్మశాలీ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్క వెంకటేశ్వర్లు కోరారు. శనివారం సంస్థాన్‌నారాయణపురం మండలంలోని పుట్టపాకలో నిర్వహించిన పద్మశాలీ కుల బాంధవుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న నూతన కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సామల భాస్కర్, జిల్లా కార్యదర్శి గజం సత్యనారాయణ, పద్మశాలీ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సామల విజయలక్ష్మి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గజం పుష్పలత, చింతకింది శ్రీధర్, సత్తయ్య, ప్రసాద్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయస్వామికి అభిషేకాలు



రామన్నపేట: ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



భూదాన్‌పోచంపల్లి: డోలారోహణం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామన్నపేట: మండలంలోని సిరిపురం శ్రీశివభక్త మార్కండేయస్వామి ఆలయంలో మార్కండేయ స్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన నిర్వహించి అభిషేకాలు చేశారు. స్వామివార్లను పట్టు వస్త్రాలతో అలంకరించారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ రాపోలు విశ్వనాథ, నిర్మాణ కమిటీ చైర్మన్ గుండు రాములు, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, మాజీ ఎంపీటీసీలు బడుగు రమేష్, పున్న వెంకటేశం, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జెల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో డోలారోహణం

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీమార్కండేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో డోలారోహణం నిర్వహించారు. స్వామివారికి లక్ష పుష్పార్చన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ సీత సత్యనారాయణ, మాజీ చైర్మన్ బడుగు చండీకేశ్వర్, ఉపాధ్యక్షుడు భారత ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, సహాయకార్యదర్శి గుర్రం కృష్ణ, కోశాధికారి యాదగిరి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

మార్కండేయ జయంతి

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని స్ఫూర్తి భవనంలో శనివారం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య,తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోచం కన్నయ్య, మోత్కూరు మండల చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వంగరి రాములు, మార్కండేయ దేవాలయ ప్రధాన కార్యదర్శి పోచం సోమయ్య, చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భక్తమార్కండేయ జయంతి

రాజాపేట: మండలంలోని రఘునాథపురం, బేగంపేట, చల్లూరు, రాజాపేట, బొందుగుల తదితర గ్రామాల్లో శనివారం శ్రీభక్తమార్కండేయ మహాముని జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయుడి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బింగి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కంటికిరెప్పలా చూసుకోవాలి

చౌటుప్పల్ : వృద్ధాప్యంలోని తల్లిదండ్రులను కంటికిరెప్పలా చూసుకోవాలని వయోవృద్ధుల సంరక్షణ, పోషణ ట్రిబ్యునల్ చైర్మన్ శేఖర్‌రెడ్డి సూచించారు. చౌటుప్పల్, నారాయణపురం, పోచంపల్లి, రామన్నపేట, వలిగొండ మండలాల నుంచి వచ్చిన ఏడు ఫిర్యాదులపై శనివారం చౌటుప్పల్‌లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తులు పంచుకుంటున్న కుటుంబసభ్యులు ఆయా ఆస్తులు సంపాదించిన వ్యక్తుల ఆలనాపాలన మాత్రం విస్మరించడం బాధాకరమన్నారు. తమ తీర్పులను ఉల్లంఘిస్తే ఆస్తుల పట్టాలను రద్దు చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు ఢీ కొని ఒకరికి గాయాలు

రామన్నపేట: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కార్మికుడిని బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రామన్నపేట మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. రామన్నపేటకు చెందిన మన్నెం శంకర్‌రెడ్డి ఐడియల్ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం తన స్కూటీపై కంపెనీకి వెళ్తుండగా డిగ్రీకళాశాల సమీపంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీబస్సు ఢీ కొట్టడంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాధితుడి సోదరుడు మన్నెం సత్తిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పి.మల్లయ్య తెలిపారు.

చెరువులు నింపాలి



కుర్రారం చెరువును పరిశీలిస్తున్న నాయకులు

రాజాపేట: మండలంలో గొలుసు కట్టు చెరువులను గోదావరి జలాలతో నింపాలని బీజేపీ జల సాధన కమిటీ డిమాండ్ చేసింది. శనివారం రాజాపేట మండలంలోని జాల, కుర్రారం గ్రామాల చెరువులను వారు రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రమేష్, నాయకులు కాయితీ బాల్ రెడ్డి, మెండు భగవాన్ రెడ్డి, బూరుగు శేఖర్ రెడ్డి, దిడ్డి సత్యనారాయణ, కాకల్ల నవీన్, సాధబోయిన శంకర్, చిగుళ్ల బీరప్ప, బిమగానీ శివ, ఉప్పరి మల్లేశం, మునిగంటి వెంకటేష్, చెప్పాల శ్రీశైలం, అమరాజు శ్రీనివాస్, బూరుగు వెంకట్ గౌడ్, పుల్లయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



ఆటో కార్మికులను ఏఐటీయూసీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు

యాదగిరిగుట్ట: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆటో కార్మిక సంఘం నాయకులు జై హనుమాన్ ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘంలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం రాములు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గోపగాని రాజు, ఆకుల శ్రీను, క్లెం సిద్దులు, ప్రదీప్, నాగరాజు, పాండు, మానుపాటి రాజు, బోదాసు లింగం, గుండ్లపల్లి శ్రీను, శివరాత్రి రాజు, కట్కూరి బాలకృష్ణ, నరసింహ తదితరులున్నారు.

సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

మోత్కూరు: రాష్ట్రంలో కొత్త జిల్లాల ప్రాతిపదికన గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్లు ఏర్పాటు చేసి సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 344 సొసైటీలలో 34371 సభ్యులు ఉండగా సుమారు 40 వేల మంది గొర్రెలు, మేకల పెంపకం వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. 436487 గొర్రెలు, 1,18,947 మేకలు ఉన్నాయని తెలిపారు. గత పది సంవత్సరాలుగా సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో వాటి ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ, సహకార సంఘం అధికారులు స్పందించి ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో లెంకల యాదగిరి, అంతయ్య పాల్గొన్నారు.

ఆవుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఆవులను రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకుని చౌటుప్పల్ పోలీసులకు అప్పగించారు. అనకాపల్లి జిల్లా తుంపాల సంత నుంచి 8 ఆవులు, 2 ఎద్దులు కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని బాహదూర్‌పూర కబేళాకు తరలిస్తుండగా.. పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో పట్టుబడ్డాయి. వాహనం డ్రైవర్ విజయనగరం జిల్లా వెపాడుమండలం కృష్ణదేవరాయుడిపేట గ్రామానికి చెందిన చల్లగోని స్వామినాయుడు యాదవ్, చల్లగోని వాసుదేవ యాదవ్, అసిస్టెంట్ విశాఖపట్నం జిల్లా కె.కోటపాడు మండలం సీతాపురం గ్రామానికి చెందిన యలమంచి మంగరాజుతో పాటు బొలేరో వాహనం యాజమాని లెంకల జనార్దన్‌రావు, హైదరాబాద్‌లోని కొనుగోలుదారుడు గఫార్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి తెలిపారు.

సోషల్ మీడియా కమిటీ సభ్యురాలిగా మౌనిక

చౌటుప్పల్: మీడియా, సోషల్ మీడియా కమిటీ సభ్యురాలిగా చౌటుప్పల్‌కు చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌనిక నియామకమయ్యారు. ఈనెల 4న హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించనున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆమె పేరును స్థానికంగా ప్రకటించారు.

వేసవిలో తాగునీటి సమస్యలు రానీయొద్దు

యాదగిరిగుట్ట రూరల్: రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ సలీం అన్నారు. శనివారం యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట, సైదాపురం, మైలార్‌గూడెం గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి ట్యాంకులను వారు పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ బోరు బావులను పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

చేనేత రంగానికి కేంద్రం మొండి చేయి

మోత్కూరు: చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మొండి చేయి చూపిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోచం కన్నయ్య అన్నారు. శనివారం వారు మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి ఇచ్చిన కేటాయింపులు కేవలం రూ.200 కోట్లు మాత్రమేనని తెలిపారు. సుమారు 45 లక్షల గ్రామీణ కుటుంబాలు ఆధారపడిన ఈ రంగంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఈ బడ్జెట్‌ను సవరించి చేనేత రంగానికి రూ.1000 కోట్లు కేటాయించాలని కోరారు.

స్వపరిపాలన దినోత్సవం

వలిగొండ, ఆత్మకూరు(ఎం), భూదాన్‌పోచంపల్లి: వలిగొండ మండల కేంద్రంలోని గాయత్రి ఉన్నత పాఠశాల, దుప్పల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అదేవిధంగా ఆత్మకూరు(ఎం) మండలంలోని కొరటికల్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాల, భూదాన్ పోచంపల్లిలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు.



ఆత్మకూరు(ఎం): జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు



వలిగొండ: ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



భూదాన్‌పోచంపల్లిలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో...